సాక్షి
పెద్దపల్లి
బుధవారం ׀ 19 ׀ ఏప్రిల్ ׀ 2023



పోటాపోటీగా పోలీస్ క్రీడలు

రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పోలీసులకు నిర్వహిస్తున్న క్రీడాపోటీలు రెండో రోజు రసవత్తరంగా సాగాయి. 8లో▸




ఖరారుకాని ఒప్పందం

ఐదు రాష్ట్రాలకు వెలుగులు పంచుతున్న రామగుండం ఎన్టీపీసీలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల జీవితాల్లో మాత్రం వెలుగులు నిండడం లేదు. 8లో▸

గరిష్టం/కనిష్టం
41.0/26.0

వాతావరణం

ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండవేడిమి అధికమవుతుంది. ఉక్కపోత మరింత పెరుగుతుంది.



న్యూస్‌రీల్

అంబేడ్కర్ ఆశయాల దిశగా పాలన



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

ధర్మారం: అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా రాష్ట్రంలో పాలన సాగిస్తున్నామని సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి మంగళవారం ఆయన భారీ గజమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రిని సహకార సంఘాల ఫోరం జిల్లా అధ్యక్షుడు ముత్యాల బలరాంరెడ్డి ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు, వ్యాపారులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు సన్మానించారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా సీఎం కేసీఆర్ 125 అడుగుల ఎత్తు అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలు దేశ ప్రజలకు దిక్సూచి లాంటివన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, వైస్ చైర్మన్ చొప్పరి చంద్రయ్య, వైస్ ఎంపీపీ మెడవేని తిరుపతి, ఎంపీటీసీ తుమ్మల రాంబాబు, ఉప సర్పంచు ఆవుల లత, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు మిట్ట తిరుపతి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాసూరి శ్రీధర్, ప్రధాన కార్యదర్శి కూరపాటి శ్రీనివాస్ సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మే 2న రాజీవ్ స్వగృహ ప్లాట్లకు వేలం

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని అంతర్గాం మండలం కుందనపల్లి రాజీవ్‌రహదారి పక్కనున్న రాజీవ్ స్వగృహ అక్షయ టౌన్‌షిప్‌లోని 22 ప్లాట్లకు మే 2న గోదావరిఖనిలోని సింగరేణి కమ్యూనిటీహాల్‌లో వేలం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సంగీత తెలిపారు. వేలంలో పాల్గొనదలచిన వారు రూ.10వేలు ఈఎండీని కలెక్టర్ పేరిట డీడీతో పాల్గొనాల్సి ఉంటుందని, ఇందుకు సంబంధించిన ప్రీబిడ్‌సమావేశం ఈనెల 26న కలెక్టరేట్‌లో ఏర్పాటు చేశామని వివరించారు.

హైదరాబాద్ పబ్లిక్‌స్కూల్‌లో ప్రవేశాలకు ఆహ్వానం

పెద్దపల్లిరూరల్: హైదరాబాద్ బేగంపేటలోని పబ్లిక్‌స్కూల్‌లో ఒకటో తరగతి ఇంగ్లిష్ మీడియంలో ప్రవేశానికి ఎస్సీ బాలబాలికలు మే ఒకటో తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సంగీత తెలిపారు. ఈ విద్యాసంవత్సరం జిల్లాకు రెండు సీట్లు కేటాయించారని, 2017 జనవరి ఒకటి నుంచి డిసెంబర్ 31లోగా జన్మించిన వారు అర్హులని, తల్లిదండ్రుల వార్షికాదాయం పట్టణవాసులకు రూ.2లక్షలు, గ్రామీణులకు రూ.1.50 లక్షలు మించరాదని, ఎస్సీ కార్పొరేషన్ నుంచి దరఖాస్తులు పూర్తిచేసి మే ఒకటో తేదీలోగా అందించాలని సూచించారు. రెండు కన్నా ఎక్కువ దరఖాస్తులందితే మే 4న కలెక్టరేట్‌లో అడిషనల్ కలెక్టర్ సమక్షంలో లాటరీ పద్ధతిన ఎంపిక చేస్తామని వివరించారు.

ప్రాణాలు కాపాడడంలో సీపీఆర్ కీలకం



పోలీసులకు శిక్షణ ఇస్తున్న ఈఎంఆర్ఐ సిబ్బంది

పెద్దపల్లిరూరల్: సీపీఆర్ విధానంపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలని పెద్దపల్లి సీఐ ప్రదీప్‌కుమార్ అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం సీపీఆర్ విధానంపై పోలీస్ అధికారులు, సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ప్రమాదాలు జరిగి మనిషి గుండె స్తంభించినపుడు.. ఊపిరితిత్తుల్లో శ్వాస తీసుకోవడం సమస్యగా మారినపుడు వారి ప్రాణాలు కాపాడేందుకు సీపీఆర్ విధానం ఉపయోగపడుతుందన్నారు. దీనిపై అవగాహన కల్పించేందుకు రోడ్‌సేఫ్టీ, జీవీకే, ఈఎంఆర్ఐ ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తున్నట్లు వెల్లడించారు. ట్రాఫిక్ సీఐ అనిల్‌కుమార్, ఎస్సై రాజేశ్, ప్రతాప్ సిబ్బంది ఉన్నారు.

కొప్పుల ఈశ్వర్‌కు తన సంక్షేమమే ముఖ్యం

- కేసీఆర్ మెప్పు కోసమే పనిచేస్తున్నారు
- పీపుల్స్‌మార్చ్ పాదయాత్రలో సీఎల్పీ నేత భట్టి విక్రమార్క
- జిల్లాలో మాఫియాలదే రాజ్యం: శ్రీధర్‌బాబు





జిల్లాకేంద్రంలో మాట్లాడుతున్న భట్టి విక్రమార్క, చిత్రంలో మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు, డీసీసీ అధ్యక్షుడు మక్కాన్‌సింగ్, మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు, ప్రజాగాయకుడు గద్దర్, ధర్మారంలో హాజరైన ప్రజలు, కార్యకర్తలు

సమస్యలు తెలుసుకునేందుకే వచ్చా..!

సాక్షి, పెద్దపల్లి: 'ఇప్పుడు ఎన్నికలు లేవు. అయినప్పటికీ కాంగ్రెస్ ఇచ్చిన తెలంగాణలో మీ సమస్యలు పరిష్కారమయ్యాయా..? లేదా..? తెలుసుకునేందుకు పాదయాత్రన మీ వద్దకు వచ్చా..' అని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క అన్నారు. ఆయన చేపట్టిన పీపుల్స్‌మార్చ్ పాదయాత్ర మంగళవారం ధర్మారంలోని రచ్చపల్లి, రామయ్యపల్లి మీదుగా పెద్దపల్లి నియోజకవర్గం పాలితంలోకి ప్రవేశించింది. అయితే దొంగతుర్తి, బొంపల్లి, మేరపల్లి, తెనుగువాడ, పెద్దపల్లి, హనుమంతునిపేట, రాంపల్లి వరకు సుమారు 20 కిలోమీటర్ల మేర ఉద్రిక్తతల మధ్య కొనసాగింది.

> 'మా మట్టి కాళ్ల భట్టిగారు పాదయాత్ర చేస్తుండంట.. పోతవురో కేసీఆర్.. మా ఉసురు తగిలిపోతావురో..' అంటూ గద్దర్ పాడిన పాటకు కార్యకర్తలు, ప్రజల నుంచి పెద్దఎత్తున స్పందన వచ్చింది.
>
> **అలరించిన గద్దర్ పాట**

కాంగ్రెస్ పార్టీ నిర్మించిన ప్రాజెక్టులతోనే..

ధర్మారం మండలం రామయ్యపల్లిలో భట్టి మాట్లాడుతూ.. కాంగ్రెస్ హయాంలో నిర్మించిన ప్రాజెక్టులతోనే రైతులకు ప్రస్తుతం సాగునీరందుతోందని, తెలంగాణ ప్రభుత్వం నిర్మించిన ప్రాజెక్టుల ద్వారా చుక్క నీరందడం లేదని పేర్కొన్నారు. రాష్ట్రంలో దుర్మార్గ పాలన కొనసాగుతోందన్నారు. దళితుల కోసం కాంగ్రెస్ హయాంలో ప్రత్యేక నిధులు కేటాయిస్తే.. ఎస్సీ ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను బీఆర్ఎస్ దుర్వినియోగం చేసిందన్నారు. రాష్ట్రాన్ని కేసీఆర్ రూ.5లక్షల కోట్ల అప్పుల్లోకి నెట్టారని విమర్శించారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పథకాలన్నీ దివంగత వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో కొనసాగాయన్నారు. 2004లోనే వైఎస్ ప్రభుత్వం ఉచిత విద్యుత్, పింఛన్లు, ధాన్యం కేంద్రాలు, ఉచిత విద్య, వైద్యం అందించారని గుర్తు చేశారు.

సొంత సంక్షేమం చూసుకుంటున్న 'కొప్పుల'

జిల్లాకేంద్రంలోని రాజీవ్ చౌక్ వద్ద ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో భట్టి మాట్లాడుతూ.. మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రజల సంక్షేమాన్ని విస్మరించి తన సంక్షేమమే చూసుకుంటున్నారని, ఆయన చేసిన అభివృద్ధి ఏమిటో చూపెట్టాలన్నారు. కేసీఆర్ మెప్పు కోసం పనిచేసే ఆయన అవసరమా..? ప్రజలే ఆలోచన చేయాలన్నారు. కవ్వాల్ టైగర్ ప్రాజెక్టు పేరుతో ఆదివాసీలను అడవి నుంచి తరిమివేశారు. మంచిర్యాల, రామగుండం ప్రజలు ఓపెన్‌కాస్ట్‌లతో, సింగరేణి ప్రైవేటీకరణతో ఇబ్బంది పడుతున్నారని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సమస్యలు పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. కేసీఆర్ పాలనలో అమ్మహస్తం అటకెక్కిందని, రైతుబంధు ఇస్తున్నామని రుణమాఫీ అమలు చేయకపోవడం రైతులను మోసం చేయడమేనని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అన్నారు.

ఇసుక, మట్టి, మర్డర్ల మాఫియా..

మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. జిల్లాలో ఇసుక, మట్టి, బూడిద దందాతోపాటు మర్డర్ల మాఫియా కొనసాగుతోందన్నారు. అధికార పార్టీ ఎమ్మెల్యేలు దందాలు చేసి దోచుకోవడానికే గెలిచినట్లు ఉందని ఎద్దేవా చేశారు. కాళేశ్వరంపై లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేసి చివరి ఆయకట్టుకు నీరు అందించాలని ఎన్నిసార్లు చెప్పినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రజాగాయకుడు గద్దర్, డీసీసీ అధ్యక్షుడు మక్కాన్ సింగ్, మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు, జెడ్పీటీసీ గంటా రాములు, జగిత్యాల డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్, కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

విజయరమణారావు వర్సెస్ రాములు

జిల్లాలో కాంగ్రెస్ నాయకుల మధ్య విభేదాలు భగ్గుమన్నాయి. స్వయంగా సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ముందే కార్యకర్తలు కొట్టుకున్నారు. జిల్లాలో మూడు అసెంబ్లీ నియోజకవర్గాలుండగా.. శ్రీధర్‌బాబుకు సొంతగూడు మంథనిలో అసమ్మతి బెడద లేదు. మిగిలిన రెండుచోట్ల వర్గపోరు చాపకింద నీరులా కొనసాగుతోంది. కొందరు రేవంత్‌వర్గం.. మరికొందరు మరోవర్గంగా చీలిపోయి ఎవరికి వారే పార్టీ కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు.

అభ్యర్థి ప్రకటనతో మొదలు..

గతంలో పెద్దపల్లికి వచ్చిన రేవంత్‌రెడ్డి.. కాంగ్రెస్ తరఫున పెద్దపల్లి ఎమ్మెల్యే అభ్యర్థిగా విజయరమణరావును ప్రకటించారు. దీంతో టికెట్‌పై ఆశలు పెట్టుకున్న ఓదెల జెడ్పీటీసీ గంటా రాములు, డీసీసీ మాజీ అధ్యక్షుడు ఈర్ల కొమురయ్య, తదితరులు అసంతృప్తి వ్యక్తం చేశారు. అప్పటి నుంచే వర్గాలుగా విడిపోయి ఎవరికి వారే కార్యక్రమాలు చేస్తున్నారు. ఇటీవల సుల్తానాపూర్‌లో ధరణి సమస్యలపై రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించగా.. విజయరమణారావు అన్నీ తానై నిర్వహించారు. అలాగే విజయరమణారావు నిర్వహిస్తున్న 'ఇంటింటికీ కాంగ్రెస్' కార్యక్రమంలోనూ రేవంత్ వ్యతిరేక వర్గం నేతలు పాల్గొనడం లేదు. గంటా రాములు, వేముల రామూర్తి తదితరులు గోనె ప్రకాశ్‌రావుతో కలిసి బీసీ వాదం పేరుతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో భట్టి పాదయాత్ర నిర్వహిస్తున్న క్రమంలో ఇరువర్గాలు బలప్రదర్శనకు దిగారు. రామగుండంలో భట్టి పాదయాత్రకు ఐఎన్‌టీయూసీ నేత జనక్‌ప్రసాద్, హర్కర వేణుగోపాల్ వర్గం దూరంగా ఉంది.

మూడుసార్లు గలాట..

పెద్దపల్లి మండలం పాలితంలోకి భట్టి పాదయాత్ర ప్రవేశించగానే ముందుగా భారీ అనుచర వర్గంతో వచ్చిన మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు స్వాగతం పలికారు. తర్వాత తన అనుచరులతో వచ్చిన గంటా రాములు స్వాగతం పలికే క్రమంలో ఇరువర్గాలు నినాదాలతో హోరెత్తించారు. ఒకరినొకరు తోసుకోవడంతో అక్కడ తోపులాట జరిగింది. భట్టి సముదాయించటంతో సద్దుమణిగింది. సాయంత్రం బొంపల్లి వద్ద మరోసారి గొడవ జరిగింది. ఈ ఘటనలో గంట రాములు వర్గీయుడు నర్సింగ్ తలకు గాయాలయ్యాయి. రాత్రి పెద్దపల్లి జెండా చౌరస్తాలో నిర్వహించిన స్ట్రీట్‌కార్నర్ మీటింగ్ వద్ద మరోసారి ఇరు వర్గీయులు కొట్టుకున్నారు. భట్టి విక్రమార్క, శ్రీధర్‌బాబు ఇరువర్గాలను సముదాయించి కార్యక్రమాన్ని కొనసాగించారు.



బాహాబాహీకి దిగుతున్న కార్యకర్తలు



గాయపడిన నర్సింగ్

అభివృద్ధి పనులు పూర్తి చేయాలి



ఎలిగేడు: తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులు తనిఖీ చేస్తున్న కలెక్టర్

ఎలిగేడు: జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులను పూర్తి చేయాలని కలెక్టర్ సంగీత అన్నారు. మండల కేంద్రంలో పర్యటించిన ఆమె సంబంధిత అధికారులతో సమీక్షించారు. రెవెన్యూ సమస్యలను సకాలంలో పరిష్కరించాలని, ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులు తిరస్కరించాల్సి వస్తే కారణాలను వివరించాలని సూచించారు. ధరణి ద్వారా రిజిస్ట్రేషన్‌లు సకాలంలో జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి హామీ పనులను లక్ష్యాల మేరకు చేపట్టాలని, వేసవి దృష్ట్యా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఓఆర్ఎస్, తాగునీరు అందుబాటులో ఉంచాలన్నారు. క్రీడా ప్రాంగణా ఏర్పాటు పూర్తిచేయాలని, బుర్హాన్‌మియాపేటలో ప్రభుత్వ భూమి పంచనామా చేసి అందులో క్రీడాప్రాంగణం ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. మన ఊరు–మనబడి పనులు వేగవంతం చేసి అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లోని రికార్డులు, అధికారుల హాజరు, ఉద్యోగుల పనితీరును పరిశీలించారు. తహసీల్దార్ నాగరాజమ్మ, ఎంపీడీవో శ్రీనివాసమూర్తి, ఎంపీపీ తానిపర్తి స్రవంతి, డెప్యూటీ తహసీల్దార్ సాయికృష్ణ ఉన్నారు.

మహిళలకు మెరుగైన ఆరోగ్యసేవలందించాలి

పెద్దపల్లిరూరల్: ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రారంభించిన ఆరోగ్య మహిళ కేంద్రాల్లో మెరుగైన సేవలందించాలని కలెక్టర్ సిబ్బందిని ఆదేశించారు. చీకురాయి రోడ్డులోని అర్బన్ పీహెచ్‌సీలో నిర్వహిస్తున్న ఆరోగ్యమహిళా కేంద్రాన్ని మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. కేంద్రం ద్వారా అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. మహిళల వివరాలను ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. కేంద్రం ఇన్‌చార్జి స్వప్న, ఏఎన్ఎం, డాటాఎంట్రీ ఆపరేటర్ తదితరులున్నారు.

చంపేసి సంతాప సభ పెడుతున్న కాంగ్రెస్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చందర్

గోదావరిఖని: చంపేసి సంతాప సభ పెట్టినట్లు కాంగ్రెస్ పార్టీ తీరు తయారైందని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ విమర్శించారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 60ఏళ్లు పాలించిన కాంగ్రెస్ రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిందన్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టుతో ఒరిగిందేమీ లేదని, కాళేశ్వరం ప్రాజెక్టుతో ప్రతి ఎకరాకూ సాగునీరందుతోందని వెల్లడించారు. బీపీఎల్ ఎవరి హయాంలో ప్రతిపాదించారని, నిర్మించకపోవడానికి కారణం ఎవరని ప్రశ్నించారు. స్పిన్నింగ్, వీవింగ్ మిల్లుల గొంతు కోసి బొందపెట్టి, కాందిశీకుల ఆకలి చావులకు కారణమైన చరిత్ర కాంగ్రెస్‌దని విమర్శించారు. సింగరేణిలో 1.20 లక్షల మంది కార్మికులుంటే 60 వేలకు పడిపోవడానికి కాంగ్రెస్ కారణం కాదా అన్నారు. కారుణ్య నియామకాల పేరుతో వారసత్వ ఉద్యోగాలను పునరుద్ధరించిన ఘనత కేసీఆర్‌దన్నారు. అసత్య ప్రచారాలు చేస్తూ పాదయాత్ర చేస్తున్న కాంగ్రెస్ నాయకులకు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. అంతకుముందు ముస్లింలకు రంజాన్ కానుకలు అందించారు.

పోయిన సెల్‌ఫోన్ దొరుకుతుంది!

- ఆ సెల్‌ఫోన్ పనిచేయదు, కొత్త సిమ్ వేస్తే తెలిసిపోతుంది..
- సీఈఐఆర్ సాంకేతికతపై రాష్ట్ర వ్యాప్తంగా పోలీసులకు శిక్షణ
- కరీంనగర్‌లో తొలిసారిగా ప్రయోగాత్మకంగా పరిశీలన
- ఇప్పటికే పలు ఫోన్లను పట్టుకున్న రూరల్ పోలీసులు
- మీరు కొన్నది దొంగ ఫోనా? కాదా? తెలిసిపోతుంది
- త్వరలో సామాన్యులకు సైతం విస్తృత అవగాహన

సాక్షిప్రతినిధి, కరీంనగర్: కొంతకాలంగా సెల్‌ఫోన్ల చోరీలు పెరిగిపోతున్నాయి. ఫోన్ పోగొట్టుకున్న వారంతా పోయిన ఫోన్ కంటే కూడా అందులో ఉండే డేటా కోసం ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా ఈ రోజుల్లో విద్య, వ్యాపారం, ఉద్యోగం, ఆరోగ్యం, బ్యాంకింగ్, రాజకీయ సమావేశాలు ఇలా ప్రతీ సమాచారాన్ని సెల్‌ఫోన్ నుంచే నిర్వహిస్తున్నారు. కరోనా తరువాత డేటా వినియోగం పెరిగింది. విద్యార్థుల నుంచి ముసలివారి దాకా స్మార్ట్ ఫోన్‌ల వినియోగం ముమ్మరంగా మారింది. ఈ క్రమంలో తమ వ్యక్తిగత, వృత్తిగత సమాచారాన్ని పలు సాఫ్ట్ కాపీల రూపంలో ఫోన్‌లోనే భద్రపరుచుకుంటున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే మన దైనందిక జీవితంలో ఫోన్ కీలకంగా మారింది. అంతటి కీలకమైన ఫోన్‌ను పోగొట్టుకున్నా.. లేక చోరీకి గురైనా ఏంటి పరిస్థితి? అమ్మో..! అస్సలు ఆ పరిస్థితినే ఊహించుకోలేని స్థితికి చేరుకున్నాం. అంతటి కీలకమైన స్మార్ట్‌ఫోన్ పోయినా.. పోగొట్టుకున్నా.. అందులో డేటా తస్కరణకు గురైతే పలు సున్నితమైన విషయాలు బయటికి వచ్చే ప్రమాదం కూడా ఉంది. అందుకే.. ఇకపై అలాంటి చిక్కులు లేకుండా తెలంగాణ పోలీసులు వినూత్న సాంకేతికతను అందుబాటులోకి తీసుకువస్తున్నారు. ఇందులో భాగంగా కరీంనగర్ కమిషనరేట్‌లో ఈ విధానం ప్రయోగాత్మకంగా అందుబాటులోకి వచ్చింది. ఇప్పటికే పోగొట్టుకున్న రెండు మొబైల్స్‌ను పట్టుకున్న పోలీసులు తిరిగి వాటిని యజమానులకు అప్పగించారు.

సీఈఐఆర్ సాంకేతికత ద్వారా..!

డిపార్ట్‌మెంటు ఆఫ్ టెలీ కమ్యూనికేషన్స్ ఆధ్వర్యంలో సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిష్టర్ (సీఈఐఆర్) సాంకేతికతను వినియోగించుకోవడం ద్వారా పోయిన సెల్‌ఫోన్‌ను తిరిగి కనిపెట్టే సాంకేతికతను పరిచయం చేస్తున్నారు. ఈ సాంకేతికతను ఉపయోగించి సీఈఐఆర్ వెబ్‌సైట్ ఓపెన్ చేసి బ్లాక్ చేయవచ్చు. సీఈఐఆర్ వెబ్‌సైట్‌లోకి వెళ్లి సెల్‌ఫోన్‌ను ఐఎంఈఐ నెంబరు సాయంతో బ్లాక్ చేయవచ్చు. ఈ తరువాత ఆ సెల్‌ఫోన్ ఎట్టి పరిస్థితుల్లోనూ పనిచేయదు. ఒకవేళ ఫోన్ ఆన్‌చేసి, అందులో కొత్త సిమ్‌కార్డు వేసినా.. ఆ విషయం ఫోన్ యజమానికి ఎస్ఎంఎస్ ద్వారా తెలిసిపోతుంది.

ఎలా పనిచేస్తుంది?

- సెల్‌ఫోన్ పోగొట్టుకున్న వెంటనే.. https://www.ceir.gov.in పోర్టల్ ఓపెన్ చేయాలి. అందులో బ్లాక్ ఫోన్ అనే ఆప్షన్‌ను ఎంచుకోవాలి.
- అందులో మొబైల్ నెంబర్–1, మొబైల్ నెంబరు–2, సెల్‌ఫోన్ బ్రాండ్, మోడల్, ఇన్వాయిస్ (బిల్) ఫొటో సూచించిన గడుల్లో నింపాలి.
- పోగొట్టుకున్న స్థలం, పోయిన తేదీ, ఇతర చిరునామాలు, అంతకుముందే ఇచ్చిన పోలీస్ కంప్లయింట్ నెంబరు, ఫోన్ యజమాని చిరునామా, ఈమెయిల్ ఐడీ, ధ్రువీకరణ కార్డులు, చప్టాలను సూచించిన బాక్సుల్లో నింపాలి.
- వెంటనే మీ సెల్‌ఫోన్ (పాత నెంబరు మీద తీసుకున్న కొత్త సిమ్) నెంబరుకు ఓటీపీ వస్తుంది.
- ఓటీపీ ఎంటర్ చేసిన తరువాత ఫామ్‌ను సబ్మిట్ చేయాలి. ఆ తరువాత ఫోన్ దానంతట అదే బ్లాక్ అవుతుంది. ఇకపై దాన్ని ఎవరూ ఆపరేట్ చేయలేరు. దానిలోని డేటా సురక్షితంగా ఉంటుంది. ఒకవేళ దొంగిలించిన వ్యక్తి లేదా సెకండ్ హ్యాండ్‌లో కొన్న వ్యక్తి సిమ్ వేయగానే.. మీ నెంబరుకు మెసేజ్ వస్తుంది.
- ఆ సందేశం ఆధారంగా ఫోన్ ఎక్కడ ఉన్నా.. పట్టుకోవడం సులభతరంగా మారుతుంది.



పెద్దపల్లి జిల్లాకు చెందిన బొడ్ల రమేశ్‌కు సెల్‌ఫోన్ అందిస్తున్న కరీంనగర్ సీపీ సుబ్బారాయుడు

> **ఇక తస్కరులకు చుక్కలే**
>
> తాజా సాంకేతికత కరీంనగర్‌లో ప్రయోగాత్మకంగా ఉపయోగిస్తున్నాం. ఇప్పటికే కమిషనరేట్ పరిధిలోని అన్ని స్టేషన్ల రైటర్లకు దీని వినియోగంపై శిక్షణ ఇచ్చాం. రూరల్ పోలీసులు ఈ సాంకేతికత ద్వారా పలు ఫోన్ల జాడ తెలుసుకుని పట్టుకోగలిగారు. త్వరలో దీనిపై సెల్‌ఫోన్ వినియోగదారులకు సైతం విస్తృత అవగాహన కల్పిస్తాం. ఇక ఫోన్ కొట్టేసినా అది పనిచేయదు కాబట్టి, చోరుల ఆటలు సాగవు.
>
> – ఎల్.సుబ్బారాయుడు, సీపీ, కరీంనగర్

అన్‌బ్లాక్ చేయండిలా..!

- మీ ఫోన్‌ను పోలీసులు పట్టుకున్నా.. లేక మీకే దొరికినా.. మీ పాత ఐడీని, ఫోన్‌నెంబరు, ఇతర వివరాలు నింపిన తరువాత ఫోన్‌ను అన్‌బ్లాక్ చేసుకోవచ్చు.

ఐఎంఈఐ నెంబరు తెలియకపోతే?

ఒకవేళ మీరు మీ ఫోన్‌ను పోగొట్టుకున్నారు. ఐఎంఈఐ నెంబరు తెలియకపోయినా/గుర్తులేకపోయినా దాన్ని ఇలా తెలుసుకోవచ్చు. మీ మొబైల్ నుంచి (#06#) డయల్ చేయగానే మీ మొబైల్ నెంబరుపై దాని ఐఎంఈఐ నెంబరు ప్రత్యక్షమవుతుంది.

- ఒకవేళ ఫోన్ పోగొట్టుకుంటే.. ఫోన్ కొన్న బాక్స్ మీద లేదా కొనుగోలు చేసిన షాప్‌లో ఉన్న ఇన్వాయిస్ (బిల్) ద్వారా ఐఎంఈఐ నెంబరు సాధించవచ్చు.

బ్లాక్ చేయండిలా..

- మీరు సెకండ్ హ్యాండ్ లేదా ఓఎల్ఎక్స్ తదితర వెబ్‌సైట్స్ లేదా తెలిసిన వారి దగ్గర ఫోన్ కొనుక్కోవాల్సి వచ్చినపుడు అది దొంగిలించిందా లేదా బ్లాక్‌లిస్టులో ఉందా? అన్న విషయం మనం కేవైఎం (నో యువర్ మొబైల్) విధానంలో ముందే తెలుసుకోవచ్చు.
- ఇందుకోసం మొబైల్ తీసుకుని కేవైఎం (నో యువర్ మొబైల్) విధానంలోనూ ఐఎంఈఐ నెంబరును తెలుసుకోవచ్చు. ఇందుకోసం కేవీఎం అని పెద్ద అక్షరాల్లో టైప్ చేయాలి. అనంతరం 15 అక్షరాల ఐఎంఈఐ నెంబరును టైప్ చేసి 14422కు ఎస్ఎంఎస్ పంపాలి.
- ఇందుకోసం కేవైఎం యాప్‌ను సైతం డౌన్‌లోడు చేసుకోవచ్చు. ఇది ఆండ్రాయిడ్/ఐఓఎస్ మొబైళ్ల ప్లేస్టోర్లలో అందుబాటులో ఉంది. లేదా సీఐఆర్ వెబ్‌పోర్టల్‌లో ఆఖరుగా ఇచ్చిన ఆప్షన్ ద్వారా కూడా సెల్‌ఫోన్ తనిఖీ చేసుకోవచ్చు.

క్లుప్తంగా

కేటీఆర్‌ను కలిసిన కోలేటి



ఆహ్వాన పత్రం అందజేస్తున్న కోలేటి

గోదావరిఖని: రాష్ట్ర మంత్రి కేటీఆర్‌ను పోలీస్‌హౌజింగ్‌బోర్డు చైర్మన్ కోలేటి దామోదర్ మంగళవారం కలిశారు. రాగినేడు గ్రామంలో నిర్మించిన శ్రీనాగలింగేశ్వరస్వామి దేవాలయ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొనాలని ఆహ్వానించారు.

స్క్రాప్ పట్టివేత



పట్టుబడిన వ్యాను

కమాన్‌పూర్(మంథని): సింగరేణి సంస్థ ఆర్జీ–3 డివిజన్ పరిధి ఓసీపీ–1 సీహెచ్‌పీ వద్ద మంగళవారం వేకువజామున వ్యాన్‌లో తరలిస్తున్న స్క్రాప్‌ను సెక్యూరిటీ గార్డులు పట్టుకున్నారు. సీహెచ్‌పీ వద్ద అనుమానంగా రోడ్డుపై వ్యాన్ ఉండంతో పెట్రోలింగ్ చేస్తున్న సెక్యూరిటీ సిబ్బంది వెళ్లారు. దీంతో డ్రైవర్ వ్యాన్‌ను వదిలిపెట్టి పారిపోయాడు. వ్యాన్‌లో నాలుగు క్వింటాళ్ల స్క్రాప్ ఉంది. దానిని పట్టుకుని కమాన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సెక్యూరిటీ అధికారి పుట్టపాక రాజయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు కమాన్‌పూర్ ఎస్సై తెలిపారు.

మాలలు ఐక్యత చాటాలి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

జూలపల్లి: మాలలు ఐక్యంగా ఉంటేనే హక్కులు సాధించుకోవచ్చని మాలల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు బొల్లం మల్లేశం అన్నారు. మండలకేంద్రంలోని మాల కమ్యూనిటీ హాల్ వద్ద మంగళవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఈనెల 23న జిల్లాస్థాయి సమావేశం ఉంటుందని, ఇందుకు సంబంధించిన పోస్టర్లను ఐక్య వేదిక నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ప్రతి మండలంలో నవోదయ వంటి రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు చేయాలని, ఎస్సీ జనాభా ప్రకారం రిజర్వేషన్ పెంచాలని, మహిళలకు 50శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు. ప్రధాన కార్యదర్శి సత్యం, కోశాధికారి శ్రీనివాస్, జగిత్యాల జిల్లా నాయకులు మ్యాకల లక్ష్మణ్, గంధం రాజయ్య, కొప్పుల శ్రీధర్, మాజీ జెడ్పీటీసీ పాటకుల నర్సయ్య, చింతమల్ల లక్ష్మి తదితరులు ఉన్నారు.

ముగిసిన గడువు.. ఖరారుకాని ఒప్పందం

- ఎదురుచూస్తున్న ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మికులు
- వేతనాలు పెరగక ఆందోళనబాట
- అయినా స్పందనలేని యాజమాన్యం

జ్యోతినగర్: ఐదు రాష్ట్రాలకు వెలుగులు పంచుతున్న రామగుండం ఎన్టీపీసీలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల జీవితాల్లో మాత్రం వెలుగులు నిండడం లేదు. వేతన ఒప్పందం 2022 ఆగస్టుతో ముగిసినప్పటికీ ఇప్పటివరకు కొత్త ఒప్పందం ఖరారు కాలేదు. దీంతో కార్మికులు నిరాశ చెందుతున్నారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలో విధులు నిర్వహిస్తున్నా తమ బతుకులు మాత్రం అధ్వాన్నంగా మారాయని ఆవేదన చెందుతున్నారు. యాజమాన్యంతో పలు దఫాలుగా చర్చలు జరుగుతున్నప్పటికీ పురోగతి లేకపోవడంతో అసహనం వ్యక్తం చేస్తున్నారు. 2022 ఆగస్టు 10న డిమాండ్ల నోటీసు అందించినా యాజమాన్యం నుంచి స్పందన లేదు. రామగుండం ఎన్టీపీసీలో 2600 మంది కాంట్రాక్టు కార్మికులు, అన్‌స్కిల్డ్ కార్మికులు రెండు వేలు, సెమీ స్కిల్డ్ 500, స్కిల్డ్ కార్మికులు 200, వెయ్యి మంది అసంఘటిత కార్మికులు, 500 మంది రోజు వారి కూలీలు పనిచేస్తున్నారు. కొత్త ప్రాజెక్టు నిర్మాణంలో వెయ్యి మంది, కార్యాలయాల్లో మరో 40 మంది కార్మికులు ఉన్నారు. ప్రస్తుతం అన్‌స్కిల్డ్ కార్మికులకు రూ.494, సెమీస్కిల్డ్‌కు రూ.577, స్కిల్డ్‌కు రూ.695 చొప్పున చెల్లిస్తున్నారు.

ఒప్పందాలు ఇలా..

- 1990కి ముందు కాంట్రాక్టు కార్మికులకు ఎలాంటి ఒప్పందాలూ జరగలేదు.
- 1995లో జరిగిన వేతన ఒప్పందంలో స్పెషల్ అలవెన్సు రూ.105కి పెంచారు.
- 2002లో కంపెనీ రూ.225, కాంట్రాక్టర్ రూ.25 కలిపి రూ.250 ఇవ్వాలని నిర్ణయించారు.
- 2004లో అంతకుముందు తొలగించిన 218 మంది కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని నిర్ణయించారు.
- 2009లో కార్మిక సంఘాల జేఏసీ సమ్మె నోటీసు, ఐదు నెలల ఉద్యమాలు, నిరసనలతో రూ.280కు పెంపు.
- 2014లో ఆరు నెలల ఉద్యమాలు, ప్యాకేజీ డిమాండ్‌తో యాజమాన్యం ఉన్న క్రమంలో రూ.430కు పెంపు. స్టాట్యుటరీలో రూ.927 చెల్లించేందుకు ఒప్పందం.
- 2018లో 17.44 శాతం అలవెన్స్ తీసుకుంటున్న కార్మికులకు రూ.3,446, పదిహేనేళ్ల పైబడి విధులు నిర్వహిస్తున్న వారికి పదోన్నతి, రాత్రి విధుల అలవెన్స్ రూ.160తోపాటు 16 డిమాండ్లపై ఒప్పందం.



లేబర్ గేట్ రోడ్డులో కార్మిక సంఘాల ప్రదర్శన (ఫైల్)

కాంట్రాక్టు కార్మికుల ప్రధాన డిమాండ్లివే..

- సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లింపు
- ప్రస్తుత అలవెన్స్‌లపై రూ.10,500 అదనంగా చెల్లించాలి.
- కనీస బోనస్ 30 శాతం పెంచాలి.
- ఖాళీ క్వార్టర్లను కార్మికులకు కేటాయింపు. లేకుంటే హెచ్‌ఆర్‌ఏ బేసిక్‌పై 60శాతం చెల్లింపు
- నైట్ అలవెన్స్ రూ.500 చెల్లించాలి. డస్ట్ అలవెన్సు కింద ప్రతినెలా రూ.వెయ్యి చెల్లించాలి.
- రెయిన్ కోట్, వామ్ కోట్, రెండు జతల బట్టలు, షూలు ఇవ్వాలి.
- మరణం సంభవిస్తే కార్మికుడి కుటుంబానికి రూ.20లక్షలు ఇవ్వాలి.
- ఆన్‌డ్యూటీలో సాధారణ మరణం చెందినా రూ.20లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి.
- ఉద్యోగ విరమణ పొందిన, మరణించిన కార్మికుడి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం లేదా రూ.పది లక్షలు చెల్లించాలి.
- డిపెండెంట్ కింద పనిలో చేరిన కార్మికులకు పూర్తిస్థాయి అలవెన్స్‌లు,పర్మినెంట్ గేట్‌పాస్‌లు.
- డెత్ రిలీఫ్ స్కీంను పూర్తిస్థాయిలో ఎన్టీపీసీ యాజమాన్యం బాధ్యత తీసుకుని కొనసాగించాలి.

కొత్త ఒప్పందం చేయాలి



కార్మికులకు మెరుగైన వేతన ఒప్పందం అమలు చేయాలి. 2022లో ఒప్పందం ముగిసినా ఇప్పటివరకు కొత్త ఒప్పందం చేయలేదు. పాత ఒప్పందంలోని పెండింగ్ అంశాలైన సీనియర్ కార్మికులకు పదోన్నతి, డిపెండెంట్ ఉద్యోగాలు కల్పించాలి.

– గీట్ల లక్ష్మారెడ్డి, సీఐటీయూ నాయకుడు

కార్మికుల ఎదురుచూపు



కాంట్రాక్టు కార్మికులకు మెరుగైన వేతన ఒప్పందంపై చర్చలు వెంటనే పూర్తి చేయాలి. కొత్త వేతన ఒప్పందం కోసం కార్మికులు ఎదురుచూస్తున్నారు. పెరిగిన ధరలను బట్టి వేతనాలు కూడా పెరగాలి. రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలి.

– భూమల్ల చందర్, ఐఎన్టీయూసీ నాయకుడు

కార్మిక సమస్యల పరిష్కారమే ధ్యేయం

- టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి



గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి

గోదావరిఖని: సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఓసీపీ–3 ఎస్‌అండ్‌డీ సెక్షన్‌లో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. పదకొండో వేజ్‌బోర్డ్ తొమ్మిదోసారి జరిగే సమావేశం ఆలస్యంతో కార్మికులు నష్ట పోతున్నారని, అలవెన్స్‌లను ఫ్రీజ్ లేకుండా వేజ్‌బోర్డు ప్రారంభించినప్పటి నుంచి చెల్లించేలా ఒప్పందం చేసుకోవాలన్నారు. కార్మికుడు చనిపోతే ఆ కుటుంబానికి రూ.కోటి నష్టపరిహారం అందేలా ఉండాలన్నారు. కోల్‌ఫీల్డ్ అలవెన్స్ ఏడుశాతం చెల్లించేలా చూడాలన్నారు. తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం అనేక హక్కులను సాధించిందన్నారు. యూనియన్ ఉపాధ్యక్షులు ఐలి శ్రీనివాస్ అధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు కొంగర రవీందర్, కొత్త సత్యనారాయణరెడ్డి, దేవ వెంకటేశం, బాలయ్య, కర్క శ్రీనివాస్, దశరథంగౌడ్ తదితరులు పాల్గొన్నారు. పలువురు యూనియన్‌లో చేరగా వారికి గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

ధాన్యం కొనుగోళ్లు సజావుగా జరగాలి

- అవసరమైతే అదనపు కేంద్రాల ఏర్పాటు
- తూకం యంత్రాలు, గన్నీసంచులు సిద్ధం చేయండి
- కలెక్టర్ సంగీత



మాట్లాడుతున్న కలెక్టర్ సంగీత

పెద్దపల్లిరూరల్: జిల్లాలో యాసంగి సీజన్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసే ప్రక్రియ సజావుగా సాగేలా అధికారులు ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ సంగీత సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ధాన్యం కొనుగోళ్లపై సమీక్షించారు. పంట కోతలు, ధాన్యం దిగుబడులను దృష్టిలో ఉంచుకుని అవసరమైతే అదనపు కేంద్రాలను ఏర్పాటుచేయాలన్నారు. కేంద్రాల్లో అవసరమైన సిబ్బంది, హమాలీలను నియమించాలన్నారు. తూకం యంత్రాలు, గన్నీ సంచులు, కనీస వసతులు కల్పించాలన్నారు. వర్షాలు కురిసినా ధాన్యం తడవకకుండా ఉండేలా టార్పాలిన్లను అందుబాటులో ఉంచాలన్నారు. కోటి ఆరు లక్షల గన్నీ సంచులు అవసరమవుతాయని, ప్రస్తుతం 56లక్షల సంచులున్నాయని, మిల్లర్ల వద్ద 8 లక్షల సంచులున్నాయని తెలిపారు. సమావేశంలో డీఆర్‌డీఓ శ్రీధర్, డీఎస్ఓ వెంకటేశ్, డీఏఓ ఆదిరెడ్డి, మైఖేల్‌బోస్, డీఎంఓ ప్రవీణ్‌రెడ్డి తదితరులున్నారు.

రైతులు పంట మార్పిడి పాటించాలి



మాట్లాడుతున్న డీఏవో ఆదిరెడ్డి

కమాన్‌పూర్(మంథని): రైతులు ఒకే రకమైన పంట కాకుండా ఇతర పంటలు వేసుకోవాలని, తద్వారా దిగుబడి పెంచుకోవచ్చని జిల్లా వ్యవసాయాధికారి ఆదిరెడ్డి అన్నారు. మండలంలోని గుండారంలో రైతు గుర్రాల లక్ష్మయ్య కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో సాగు చేస్తున్న ఆయిల్ పాం తోటలో అంతరపంటగా వేసిన పొద్దుతిరుగుడు పంటను మంగళవారం పరిశీలించారు. ఏటా ఒక రకమైన పంట చేయొద్దని, పంట మార్పిడి పాటించాలని రైతులకు సూచించారు. ఆయిల్ పాం తోటలో వేరుశనగా, పుచ్చకాయ, కూరగాయలను అంతరపంటలుగా సాగు చేసుకోవచ్చని పేర్కొన్నారు. కేవీకే హెడ్ శ్రీనివాస్, ఎంపీపీ రాచకొండ లక్ష్మి, సర్పంచ్ ఆకుల ఓదెలు, ఏడీఏ మురళీ, శాస్త్రవేత్తలు వెంకన్న, కిరణ్, వినోద్, ఏవో బండి ప్రమోద్‌కుమార్ ఏఈవో సురేశ్ పాల్గొన్నారు.

సింగరేణి అధికారుల బదిలీలు

గోదావరిఖని: సింగరేణిలో 18మంది మైనింగ్ అధికారులను బదిలీ చేస్తూ యాజమాన్యం మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. బదిలీ అయిన అధికారులు ఈనెల 25లోగా రిపోర్టు చేయాలని ఆదేశించారు.

పేరు	హోదా	ప్రస్తుతం	బదిలీ
ఎ.రాజేశ్వర్‌రెడ్డి	డీజీఎం	ఖైరిగూడఓసీ	మందమర్రి
ఎస్.మధుసూదన్	డీజీఎం	ఆర్‌కేఓసీ	ఓసీపీ–3
ఎన్.సత్యనారాయణ	డీజీఎం	ఆర్కే–7	ఏజెంట్, ఖైరిగూడ ఓసీ
జీవీ.కోటిరెడ్డి	డీజీఎం	కొత్తగూడెం	ఎస్ఓటూజీఎం, కొత్తగూడెం
ఎ.శ్రీధర్‌రావు	డీజీఎం	ఆర్కేపీ–1ఏ	ఎస్ఓటూజీఎం, శ్రీరాంపూర్
ఎం.గోవిందరావు	డీజీఎం	జీడీకే–5ఓసీపీ	పీఓ ఆర్కేఓసీపీ
ఎం.వెంకటేశ్వర్‌రావు	డీజీఎం	కిష్టారం ఓసీ	ఏఎస్ఓ కొత్తగూడెం
ఎం.రవీందర్	డీజీఎం	కాసిపేట్–2గని	ఏఎస్ఓ మందమర్రి
ఎం.రాముడు	డీజీఎం	పీకే ఓసీ	ఏఓ ఆర్కే–7గ్రూప్
షేక్‌మదార్	ఎస్ఎం	సీఎంసీ,కార్పొరేట్	పీఅండ్‌పీ కార్పొరేట్
బి.శ్రీనివాస్	ఎస్ఎం	జేవీఆర్ఓసీ	సీఎంసీ కార్పొరేట్
జి.లక్ష్మినారాయణ	కాలరీ	మేనేజర్‌కేకే–1	కాసిపేట్–2
బి.రామక్రిష్ణ	ఏఎం	ఎస్టేట్, కేజీఎం	కిష్టారం, ఓసీ
కె.సురేష్‌కుమార్	ఏఎం	జీడీకే–11	పీకేఓసీ
ఎస్.ఎస్ఆర్‌మురళి	ఏఎం	జీకేఓసీ	మేనేజర్, జీకేఓసీ
ఎం,వీరయ్య	ఏఎం	ఎస్ఆర్‌పీ–2	మేనేజర్ జేవీఆర్ ఓసీ
జె.తిరుపతి	ఏఎం	జీడీకే–5	మేనేజర్ జీడీకే సీఎం
ఎం.గంగాధర్	ఏఎం	ప్రాజెక్టుప్లానింగ్	సీడీఎం,హైదరాబాద్

ప్రభుత్వం విద్యుత్ బకాయిలు చెల్లించాలి

- బీఎంఎస్ అధ్యక్షులు యాదగిరి సత్తయ్య



గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న యాదగిరి సత్తయ్య

గోదావరిఖని: సింగరేణి సంస్థకు రావాల్సిన విద్యుత్ బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించాలని బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్జీ–2 ఏరియా ఓసీపీ–3 బేస్‌వర్క్‌షాప్‌లో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. కార్మిక హక్కుల పరిరక్షణ, సంస్థ సంరక్షణ ధ్యేయంగా పనిచేస్తున్న బలమైన జాతీయభావాలు, క్రమశిక్షణ, దేశభక్తి కలిగిన కార్మిక సంఘం బీఎంఎస్ అన్నారు. నాయకులు వడ్డేపల్లి కుమారస్వామి, వై.సారంగపాణి, పెండం సత్యనారాయణ, మాదాసు రవీందర్ పాల్గొన్నారు.

ఎన్టీపీసీలో స్థానికులకు అవకాశం ఇవ్వాలి



మాట్లాడుతున్న బాబర్ సలీంపాషా

జ్యోతినగర్: ఎన్టీపీసీ తెలంగాణ ప్రాజెక్టులో స్థానికులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని ఐఎన్టీయూసీ జాతీయ సీనియర్ కార్యదర్శి బాబర్ సలీంపాషా డిమాండ్ చేశారు. మంగళవారం ప్రాజెక్టు రోడ్‌లో యూపీఎల్ సంస్థ మూసివేత కారణంగా ఉపాధి కోల్పోకుండా 61 మంది డిప్లమో ఇంజినీర్లను విధులలో కొనసాగించేందుకు తక్షణమే వారికి గేట్‌పాస్‌లు పునరుద్ధరించాలని అన్నారు. నాలుగేళ్ల ప్రాజెక్టులో విధులు నిర్వహిస్తున్న డిప్లమో ఇంజినీర్లను విధులలోకి తీసుకునేందుకు వీలుగా సంబంధిత కాంట్రాక్టర్లకు ఆదేశాలు ఇవ్వాలని ఉన్నతాధికారులను కోరారు. ఎన్టీపీసీ సంస్థలో కాంట్రాక్టర్ మారినా కార్మికులు మారకుండా గతంలో ఒప్పందం ఉందన్నారు. సంస్థలోని మ్యాన్ పవర్ సప్లై టెండర్లలో మైనస్ టెండర్లను ఆమోదించడంద్వారా కార్మికులు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. సంస్థలో మైనస్ టెండర్ల విదానంను రద్దు చేయాలని కోరారు. ఎస్ఆర్‌హెచ్‌క్యూ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌తోపాటు ఎన్టీపీసీ రామగుండం–తెలంగాణ ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఏజీఎం హెచ్ఆర్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఐఎన్టీయూసీ నాయకులు భూమల్ల చందర్, డిప్లమో ఇంజినీర్లు పాల్గొన్నారు.

మైన్స్ సేఫ్టీ కమిటీలో అందరికీ అవకాశం కల్పించాలి



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

గోదావరిఖని: మైన్స్ సేఫ్టీ కమిటిలో అన్ని యూనియన్లకు అవకాశం కల్పించాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం జీడీకే–11గనిపై వినతిపత్రం అందించారు. సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు 2017 అక్టోబర్ 5న జరిగగా టీబీజీకేఎస్ ఎన్నికైందని, గుర్తింపు సంఘం కాలపరిమితి రెండేళ్లుకాగా.. ఆరేళ్లు పూర్తయినా ఆ యూనియన్‌కే ప్రాధాన్యం ఇస్తోందన్నారు. యాజమాన్యం స్పందించి ప్రస్తుతం ఉన్న మైన్స్ సేఫ్టీ కమిటీలను రద్దు చేసి ఇకముందు జరిగే అన్ని అధికారిక సమావేశాల్లో అన్ని సంఘాలకు ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. నాయకులు మోదుగుల సంపత్, జి.సంపత్, పోతరాజు భాస్కర్, అన్నం శ్రీనివాస్, సుద్దాల కుమార్, శేఖర్ తో పాటు అన్ని కార్మిక సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

జగిత్యాలక్రైం: పొలాస శివారులో సోమవారం రాత్రి ద్విచక్ర వాహనాన్ని మరో బైక్ ఢీకొనడంతో ఎండబెట్ల విజయ్‌కుమార్(36) తీవ్రంగా గాయపడి మంగళవారం ఉదయం మృతిచెందాడు. సారంగాపూర్ మండలం అర్పపల్లి గ్రామానికి చెందిన ఎండబెట్ల విజయ్‌కుమార్.. పనినిమిత్తం జగిత్యాలకు వచ్చి రాత్రి ఇంటికి వెళ్తున్నాడు. పొలాస శివారులో ఎదురుగా వచ్చిన ద్విచక్ర వాహనం విజయ్‌కుమార్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ప్రమాదంలో విజయ్ తల, కుడికాలుకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు జగిత్యాల ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు.

పొలితం వద్ద 'భట్టి'కి స్వాగతం



పొలితం వద్ద స్వాగతం పలికేందుకు తరలివచ్చిన కార్యకర్తలు, నాయకులు

పెద్దపల్లిరూరల్: సీఎల్పీ నేత భట్టివిక్రమార్క పీపుల్స్‌మార్చ్ పాదయాత్ర పొలితం గ్రామం వద్ద పెద్దపల్లి నియోజకవర్గానికి చేరింది. భట్టి విక్రమార్క, కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు ఠాకూర్ మక్కాన్‌సింగ్‌కు మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు శాలువా కప్పి స్వాగతం పలికారు. నాయకులు సత్యనారాయణరెడ్డి, గంటా రాములు, వేముల రామ్మూర్తి, బి.రమేశ్‌గౌడ్, యాట మల్లారెడ్డి, బి. సురేశ్‌గౌడ్, మహేందర్, ప్రకాశ్‌రావు తదితర నాయకులు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.

కాంగ్రెస్ ఫ్లెక్సీలతో నిండిన పెద్దపల్లి

భట్టి చేపట్టిన పాదయాత్ర నియోజకవర్గంలో మూడురోజులు సాగనుంది. దీంతో భట్టికి స్వాగతం పలుకుతూ కాంగ్రెస్ నాయకులు ఫ్లెక్సీలను పోటాపోటీగా ఏర్పాటు చేశారు. మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు ఫ్లెక్సీలతోపాటు ఓదెల జెడ్పీటీసీ గంట రాములు ఫ్లెక్సీలతో పెద్దపల్లిని అలంకరించారు.

పోటాపోటీగా పోలీస్ క్రీడాపోటీలు



బహుమతులు అందజేస్తున్న సీపీ రెమా రాజేశ్వరి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీసీపీలు



వాలీబాల్ పోటీల్లో తలపడుతున్న కానిస్టేబుళ్లు

గోదావరిఖని: రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పోలీసులకు నిర్వహిస్తున్న క్రీడాపోటీలు రెండోరోజు రసవత్తరంగా సాగాయి. పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల పోలీసులు పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. వాలీబాల్, షార్ట్‌పుట్, డిస్క్‌త్రో, పరుగుపందెం తదితర పోటీలు ఉత్సాహాన్ని నింపాయి. పోటీలను పెద్దపల్లి డీసీపీ వైభవ్‌గైక్వాడ్, మంచిర్యాల డీసీపీ సుధీర్‌కేకన్‌నాథ్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. పోటీల్లో గెలుపొందిన పోలీసు సిబ్బంది, అధికారులకు సీపీ రెమా రాజేశ్వరి బహుమతులు అందించారు.



షార్ట్‌పుట్ వేస్తున్న మహిళా కానిస్టేబుళ్లు